క్లుప్తంగా...

నేడు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, శ్రీవెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర శత కలశక్షీరాభిషేకం (108 లీటర్ల పాలతో), ఉదయం 9.30 గంటలకు శ్రీవిష్ణు సహస్ర నామ సహిత లక్ష తులసీ దళములతో విశేష అర్చన, స్వామివారికి విశేష ఫల పుష్ప అలంకరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పీవీకి నివాళులర్పించిన డిప్యూటీ మేయర్



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: దేశ ప్రధాని దివంగత నేత పీవీ నరసింహ్మారావు 102 జయంతిని పురస్కరించుకుని బుధవారం నెక్లెస్ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి పాల్గొన్నారు. పీవీ ఘాట్‌లో పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి పీవీ అందించిన పరిపాలనా సంస్కరణలను ఈ సందర్భంగా ఆమె స్మరించుకున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన విజయవర్ధన్ నాయుడు



రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న విజయవర్ధన్ నాయుడు

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్టీల్ కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు కల్లూరి విజయవర్ధన్ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి.. నియోజకవర్గంలోని సీనియర్ నాయకులందరూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేలా కృషిచేయాలని సూచించారు.

నేషనల్ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ



నేషనల్ సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. లింబాద్రి

లాలాపేట: ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జూలై 21,22 తేదీల్లో నిర్వహించతలపెట్టిన నేషనల్ సెమినార్ బ్రోచర్‌ను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి ఆవిష్కరించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ డిజిటల్ ఎరా–ఇష్యూస్, చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్ అనే అంశంపై 2 రోజుల పాటు నేషనల్ సెమినార్ ఓయూ దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో జరుగనుంది. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ ప్రొ.అరుణజ్యోతి, కో కన్వీనర్ బాలబ్రహ్మచారి తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయ నాలుగో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంజీవయ్య నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగ నిర్వహణకు ప్రతి దేవాలయానికి నిధులు ఇస్తూ పండుగలు వైభవంగా జరుపుకునేందుకు సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్. వేణుమాధవ శర్మ, రాజు కుమార్, విజయ్, రవి కుమార్, కాంత్ రాజ్, మహేందర్, సుధాకర్, ఎల్లస్వామి, గోపి, పవన్ కుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై బేగంపేట ట్రాఫిక్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం..

సనత్‌నగర్: విధి నిర్వహణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడడంలో ట్రాఫిక్ పోలీసులు తమదైన పాత్ర పోషిస్తున్నారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని టీటీఐలో ట్రాఫిక్ పోలీసులకు బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా వీ9 హాస్పటల్ వైద్యులు హాజరై పోలీసు సిబ్బందికి సీపీఆర్, ఏఈడీ, మాస్క్‌తో కూడిన అంబు బ్యాగ్, ప్రథమ చికిత్స తదితర అత్యవసర వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గుండె పోటుకు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా వారికి ఊపిరితిత్తుల పునరుజ్జీవం జరిగేలా ఏవిధంగా ట్రీట్‌మెంట్ అందించాలో డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గుండె పోటుతో అకస్మాత్తుగా కుప్పకూలిపోవడం వంటి సంఘటనలు ఎదురైనప్పుడు పోలీసులు వారికి సకాలంలో ప్రాథమిక చికిత్స అందించడంలో ముందుండాలన్నారు. పోలీసు అంటే సామాజిక బాధ్యత అనే విషయాన్ని ఎల్లవేళలా గుర్తెరగాలన్నారు. విధి నిర్వహణే కాకుండా అవసరమైప్పుడు వైద్యుడిగా మారి తమకు తెలిసిన అత్యవసర వైద్య సేవలను అందించాలన్నారు. ఈ క్రమంలో ఎమర్జెన్సీ సర్వీసులు అందించడంపై పోలీసు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, వీ9 హాస్పటల్ టీమ్ డాక్టర్ నగ్మా, కృష్ణప్రసాద్, ఉత్తేజ్, శ్రీమాధవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల నేపథ్యంలో సమస్యలు పరిష్కరించండి



అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణితో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: బోనాల జాతర సమీపిస్తున్న నేపథ్యంలో సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు ఆమె జలమండలి ప్రభు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ జీ.శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందించారు. అధికారులతో సమావేశమైన సామల హేమ రెండు విభాగాలకు సంబంధించిన సమస్యలు నివేదించారు. అనంతరం ఇటీవలే ప్రారంభించిన సీతాఫల్‌మండి వార్డు కార్యాలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ వార్డు కార్యాలయ అధికారి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణితో సమావేశమయ్యారు. అన్ని విభాగాల అధికారులు వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధికారులకు సత్కారం

అమీర్‌పేట: రహదారుల నిర్మాణంలో చొరవ చూపిన జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్, రాయల సేవా సమితి ప్రతినిధులు బుధవారం అమీర్‌పేట వార్డు కార్యాలయంలో సన్మానించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలోని బీకేగూడ, శ్రీరామ్‌నగర్ కాలనీ, బీజేఆర్‌నగర్‌లో వీడీసీసీ రోడ్లు వేసి ఇబ్బందులు తొలగించారని కొనియాడారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

లాలాపేట: తమను రెగ్యులరైజ్ చేయాలనీ కోరుతూ బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఓయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళా అధ్యాపకురాళ్లు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఓయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఓయూ జేఏసీ చైర్మెన్ డాక్టర్ పరశురాం మాట్లాడుతూ కాంట్రాక్టు జేఎల్, డీఎల్‌ను రెగ్యులరైజ్ చేసిన విధానంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఏసీపీకి పలువురి శుభాకాంక్షలు

రసూల్‌పురా: ఏసీపీగా పదోన్నతి పొందిన కార్ఖాన సీఐ రవీందర్‌ను బుధవారం పలువురు నేతలు కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ గొల్లకురుమ సంఘం అధ్యక్షుడు కనకరాజు ఆధ్వర్యంలో పలువురు పీఎస్‌లో రవీందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు.

ట్రాఫిక్ అవాంతరాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బౌద్ధనగర్: సాక్షిలో ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసుల్లో చలనం వచ్చింది. వారాసిగూడ చౌరస్తాలో రోడ్డు మొత్తాన్ని ఆక్రమించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలకు ఉపక్రమించారు. ఈ నెల 28వ తేదీన వారాసిగూడ చౌరస్తాలో ఎదురవుతున్న ట్రాఫిక్ అవాంతరాలపై సాక్షిలో 'రోడ్డుపైనే పార్కింగ్' శీర్షికన సాక్షిలో ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, చిలకలగూడ, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తిమ్మప్ప, భరత్‌కుమార్, వారాసీగూడ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు కలిసి వారాసిగూడ చౌరస్తాలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ షాపులు, వైన్ షాపుల ముందు ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచడంతో రోడ్డుకు అడ్డుగా ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రోడ్డును ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే చలాన్లు విధించడంతో పాటు షాపు యజమానుల పట్ల చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటోలు కూడా అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా ఒక క్రమపద్ధతిలో ఉంచుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఈ రోడ్డు కూడా ఇరుకుగా ఉండటంతో విస్తరణ చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖ రాయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



వారాసిగూడ చౌరస్తాను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తెలంగాణలో కుటుంబ పాలన అంతం చేద్దాం



సీతాఫల్‌మండిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి

సికింద్రాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సీఎంతోపాటు ఎమ్మెల్యేల వరకు ప్రజాప్రతినిధులు అందరూ కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి విమర్శించారు. సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో బుధవారం పర్యటించిన బండ కార్తీకరెడ్డి మోదీ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే కుటుంబ పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కుటుంబ పాలనను అంతమొందించి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగడం కోసం వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఉండడం ద్వారా సత్వర అభివృద్ధి సాధ్యమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయిబాబా, నాగేశ్వర్‌రెడ్డి, నరహరి, రాజేశ్వర్‌రావు, అరవింద్, ప్రభుగుప్త, ఆకుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యువత శాస్త్రీయత దృక్పథంతో ముందుకు సాగాలి

పద్మారావునగర్: యువత శాస్త్రీయత దృక్పథంతో ముందుకు సాగాలని మాజీ డీజీపీ డాక్టర్ కరణం అరవిందరావు అన్నారు. సాహితీ సమాఖ్య అధ్వర్యంలో బ్రహ్మశ్రీ బులుసు అప్పన్నశాస్త్రి 1941లో రచించిన శ్రీ భగవద్గీతా శాంకర భాష్య తత్వబోధిని(అయిదు భాగాల అపూర్వగ్రంథం) పునర్ముద్రణ పుస్తకాలను బుధవారం పద్మారావు నగర్‌లోని శ్రీ శివానంద ఆశ్రమంలో బ్రహ్మ విద్యాకుటీర్ స్వామి తత్వవిదానంద సరస్వతీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ డీజీపీ అరవిందరావు మాట్లాడుతూ సామాజిక పరిస్థితుల నేపథ్యంలో భగవద్గీతపై ప్రజల్లో మరింత ప్రాచుర్యం తీసుకురావలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. గ్రంథ పరిచయం చేసిన గుంటూరుకు చెందిన చింతపల్లి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఆనాటి పండితులు, స్వామిజీలు ఆదర్శంగా తీసుకుని స్వాతంత్రోద్యమకారులలో చైతన్య స్ఫూర్తిని అందించడానికి ఎంతో దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ సమాఖ్య కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ, ప్రతినిధులు పి. రఘు, బీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం



నార్త్‌లాలాగూడలో పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

సికింద్రాబాద్: నార్త్‌లాలాగూడలో తాగునీటిపైప్‌లైన్ పనులను అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు నిర్మించడం ద్వారా కలుషిత జలాలు, లోప్రెషర్ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు కాలనీలు, బస్తీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో డివిజన్‌లో ప్రారంభించిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, పొన్నాలరాజు, మహ్మద్, అమర్ పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి



బౌద్ధనగర్: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన తొలి తెలుగు బిడ్డ పీవీ నరసింహా రావు అని కొనియాడారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి



డబుల్‌బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

రసూల్‌పురా: డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురాలోని నారాయణ జోపిడి హట్స్, సిల్వర్ కాంపౌండ్ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ విభాగం అధికారులు, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ ఇతర బీఆర్‌ఎస్ నాయకులతో కలసి మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సిల్వర్ కాంపౌండ్ వద్ద కోర్టు కేసు వేసిన నలుగురితో మాట్లాడి సమస్య పరిష్కరించి మరో బ్లాక్ ఇళ్ళ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న 40 ఇండ్ల బ్లాక్‌ను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నారాయణ జోపిడి హట్స్ డబుల్‌బెడ్‌రూం పనులు మందకొడిగా సాగుతున్నాయని త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇళ్ళ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నాలా పూడిక తీత పనులు పరిశీలించారు. కార్యక్రమంలో హౌజింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట కృష్ణదాస్, డీఈ గంగాధర్, ఏఈ మహేష్, మార్కెట్ కమిటీ సభ్యులు నయీం, బీఆర్‌ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, డబుల్‌బెడ్‌రూం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్య కుమార్‌కు ఓయూ డాక్టరేట్



లాలాపేట: కొమ్మెర ఆదిత్య కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఓయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ. సురేష్ పబ్బోజు పర్యవేక్షణలో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ నుంచి ఆదిత్యకుమార్ డాక్టరేట్‌ను అందుకున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు గ్రామం నుంచి యూనివర్సిటీ స్థాయిలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను పొందడంపై డా. శంకర్ నాయక్ భూక్యా, పలువురు ఓయూ ప్రొఫెసర్లు, తల్లిదండ్రులు కృష్ణమూర్తి, పుష్పలీల, కుటుంబ సభ్యులు ఆదిత్య కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా ఆదం సంతోష్ జన్మదిన వేడుకలు



ఆదం సంతోష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

సికింద్రాబాద్: పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీలకు చెందిన నాయకులు హాజరై సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ లష్కర్ ప్రజలకు సేవలు అందించడం కోసమే తన జీవితాన్ని అంకితం చేస్తామన్నారు. ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు బాబునాయక్, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, మాడిశెట్టి నరేశ్, సీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంవల్లే ఉచిత నీరు వచ్చింది



కంటోన్మెంట్: కోర్టుకెళ్లి పోరాటం చేసినందువల్లే రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఉచిత నీరు ఇచ్చిందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు దర్జీ బస్తీలో బోర్డు నిధులతో చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ పట్ల వివక్ష చూపుతోందన్నారు. మూడేళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉచిత మంచి నీటి పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్‌కు మాత్రం వర్తింప చేయలేన్నారు. దీనిపై కోర్టుకెళ్లి నిలదీస్తే, తక్షణమే స్పందించి కంటోన్మెంట్‌లోనూ ఉచిత నీళ్లు ఇస్తోందన్నారు. అయినప్పటికి ఇక్కడి ప్రజల అవసరాలకు సరిపోయే స్థాయిలో నీరు విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుశరామ్, భిక్షపతి, శివ, మహేశ్, శంకు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో తెలంగాణకు మెరుగైన స్థానం : ప్రొ లింబాద్రి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో ఈ పదేళ్ల కాలంలో అనూహ్య మార్పులు జరిగాయిని, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. జాతీయ సగటుతో పోల్చితే విద్యారంగంలో తెలంగాణ మెరుగైన స్థానాన్ని సాధించిందని స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఓయూలో ఈనెల 26 నుంచి జరిగిన భారత దేశంలో సామాజిక సమూహాల అభివృద్ధి సాధికారత–తెలంగాణ రాష్ట్రం నుంచి పాఠాలు అనే అంశంపై జరుగుతున్న జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, ఐసిఎస్ ఎస్‌ఆర్–ఎస్‌ఆర్‌సీ గౌరవ సంచాలకులు ప్రొ. బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్నాటక, మధ్యప్రదేశ్, కేరళ, హర్యానా, న్యూ ఢిల్లీ తదితర రాష్ట్రాలనుంచి 25 మంది పరిశోధకులు పేపర్ ప్రజెంటేషన్ చేశారు.

ఓయూలో యూకే అధ్యాపకుల పర్యటన



ఓయూ వీసీతో యూకే అధ్యాపకుల బృందం

లాలాపేట: యూకేలోని అబెరిస్ట్విత్ యూనవర్సిటీకి చెందిన పలువురు అధ్యాపకులు బుధవారం ఓయూ క్యాంపస్‌లో పర్యటించారు. వారితో ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ సమావేశం అయ్యారు. ఇప్పటికే అబెరిస్ట్విత్ యూనివర్సిటీతో ఓయూకు పరస్పర అవగాహన ఒప్పందం ఉన్నందున కలిసి పనిచేద్దామని వీసీ రవీందర్ అన్నారు. రెండు యూనివర్సిటీలు కలిసి పరిశోధనలు నిర్వహించడంతో పాటు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూకే అధ్యాపకులు డా డేవిడ్ బ్రయంట్, డాక్టర్ అలన్ హంగేస్,డేవిడ్ వారెన్, హరీశ్ లోకుమ్ తదితరులున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ వీసీకి ఘన సన్మానం

లాలాపేట: ఓయూలోని భూగోళ శాస్త్రం విభాగంలో బుధవారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.సీతారామారావు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయం జియో ఇన్ఫార్మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రొ.సీతారామారావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బీఏ జాగ్రఫీ కోర్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కోర్సు మెటీరియల్‌ను ప్రింటెడ్ పుస్తకాలతో పాటు ఆడియో, వీడియో ద్వారా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఓయూ వీసి రవీందర్, సైన్స్ డీన్ బాలకిషన్, శ్రీనివాసరావు, అశోక్, డా. అనురాధ తదితరులున్నారు.

